క్లుప్తంగా

నేడు వారతిప్పలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారం

మొగల్తూరు: మండలంలోని వారతిప్ప గ్రామంలో ఆదివారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కర్రి ఏసుబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చురుగ్గా పంటబోదెల తవ్వకం



కాళీపట్నం తూర్పులో పంటబోదె తవ్వకం పనులు పరిశీలిస్తున్న జేఈ ఆనంద్‌

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మ చెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, కాళీపట్నం గ్రామాల్లో పంటబోదె పనుల తవ్వకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మొగల్తూరు ప్రధాన కాలువ నుంచి జంగిల్‌ చానల్‌ మీదుగా కేపీ పాలెం నార్త్‌లోని మంచినీటి ప్రాజెక్టు చెరువుకు అందే పంట కాలువ పనులు పూర్తయ్యాయి. శనివారం కాళీపట్నంతూర్పులోని శివారు ప్రాంతాలకు సాగు నీరందే పంట బోదె పనులను ప్రారంభించగా జేఈ ఆనంద్‌ తవ్వకం పనులను, మస్టర్‌ను పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు.

ప్రసాదరాజుపై బాబు వ్యాఖ్యలు అర్థరహితం



తిర్రే బాబూరావు

నరసాపురం: నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన విమర్శలు అర్థరహితంగా ఉన్నాయని వైఎస్సార్‌ సీపీ నేత, రిటైర్డ్‌ మున్సిపల్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ తిర్రే బాబూరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టీమర్‌రోడ్డులో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ముదునూరి ఏటిగట్టు పనుల్లో అవినీతి చేశారని ఆరోపించడంలో అర్థం లేదన్నారు. ముదునూరిపై చిన్న అవినీతి మరక కూడా లేదన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని ముదునూరి అభివృద్ధి చేశారన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వశిష్టవంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్‌, ఫిషరీష్‌ యూనివర్సిటీ లాంటి ప్రాజెక్ట్‌ల కలలను ముదునూరి నిజం చేశారన్నారు. మరో పక్క 100 పడకల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్‌ ఆధునికీకరణ చేశారన్నారు. కాటన్‌ పార్కును అతి సుందరంగా తీర్చిదిద్దన ఘనత ముదునూరికే దక్కుతుందని పేర్కొన్నారు. మళ్లీ ముదునూరిని ఎమ్మెల్యేగా చూడాలని నియోజకవర్గంలో అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారని చెప్పారు.

వైభవ వేంకటేశ్వరునిగా వేములదీవి వెంకన్న



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్‌: మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా వైభవ వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అలాగే మధ్యాహ్నం స్వామి వారి ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

12 నుంచి జై భీమ్‌ షటిల్‌ టోర్నమెంట్‌

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీకి చెందిన జైభీమ్‌ షటిల్‌ కోర్టు సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో ఉండి, భీమవరం టౌన్‌ స్థాయిలో షటిల్‌ టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నట్లు ఎ.రాజేశ్‌ఖర్‌, ఎం.అనిల్‌, జి.అజిత్‌, హెడ్‌ కోచ్‌ నక్కా మరియదాసు తదితరులు తెలిపారు. శనివారం ఉండిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉయ్యూరు ఆర్డీఓ దాసి రాజు ఆర్థిక సహకారంతో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతిని పురస్కరించుకుని రెండు రోజులపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.2వేలు, షీల్డు, రెండో బహుమతి రూ.1500, షీల్డ్‌, మూడవ బహుమతి 1000, షీల్డ్‌, నాలుగో బహుమతి రూ.500,షీల్డ్‌ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలని ఆసక్తి కలవారు 12వ తేదీ సాయంత్రం 6 గంటలలోపుగా రిజిస్ట్రేషన్‌ ఫీజు రూ.300 చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99666 96734, 96664 48237 నెంబర్లకు ఫోన్‌ చేయాలని సూచించారు.

బీసీలకు సముచిత స్థానం



ఆచంట వేమవరంలో మహిళకు అభివాదం చేస్తున్న మాజీమంత్రి శ్రీరంగనాథరాజు



ఆచంట వేమవరంలో శ్రీరంగనాథరాజు ప్రచారం చేస్తున్న దృశ్యం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంట మండలం ఆచంట వేమవరంలో ఎన్నికల శంఖారావంలో భాగంగా పాదయాత్రలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తు న పాల్గొని శ్రీరంగనాథరాజుకు స్వాగతం పలికారు. ఆచంట నియోజకవర్గాన్ని ప్రభుత్వ నిధులతో పాటు, సొంత నిధులు ఖర్చు చేసి అభివృద్ధి బాటన నడిపారంటూ కొనియాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు నడిచిన వైఎస్సార్‌ సీపీకి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీలను వాడుకొంటూ వారిని మోసం చేసిందని విమర్శించారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఏ పార్టీ బీసీలకు అండగా లేదన్నారు. కేవలం వైఎస్సార్‌ సీపీ మాత్రమే అండగా నిలిచిందన్నారు. వైఎస్సార్‌ సీపీ పాలనలో బీసీలకు ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పదవులు ఇచ్చామన్నారు. ఎన్నికల్లో పార్లమెంటు స్థానాన్ని తొలిసారిగా బీసీ మహిళకు కేటాయించి చరిత్ర సృష్టించదన్నారు. కోస్తా జిల్లాల్లో మూడు పార్లమెంటు స్థానాలు బీసీలకు కేటాయించి బీసీ పక్షపాతిగా నిలిచిందన్నారు. బీసీలతో పాటు అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. ప్రజలందరూ వైఎస్సార్‌ సీపీకి అండగా నిలిచి రెండు ఓట్లూ ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో పెనుమంట్ర జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఆచంట ఏఎంసీ చైర్మన్‌ చిల్లే లావణ్య, మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్‌, సర్పంచ్‌ జక్కంశెట్టి చంటి, ఉప సర్పంచ్‌ కొండేటి సురేష్‌, రాష్ట్ర వీవర్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టరు అందే నాగ బసవన్న, ఏఎంసీ డైరెక్టరు గెద్దాడ వరలక్ష్మీ, కడలి శ్రీప్రసాద్‌, వీరా వీరభద్రం, పోసెట్టి లీలా సుబ్బారావు, గెద్దాడ మంగరావు, కొడమంచిలి రాజు, పుచ్చకాయల సూరిబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి

చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు



దర్బరేవు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు



వృద్ధురాలితో మాట్లాడుతున్న చీఫ్‌ విప్‌ ప్రసాదరాజు

నరసాపురం రూరల్‌: సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా సీఎం పాలన సాగిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌ విప్‌, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం నరసాపురం మండలంలోని దర్బరేవు గ్రామంలో ప్రజా ఆశీర్వాదయాత్ర పేరుతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన మేలు, అభివృద్ధి గురించి వివరించారు. సంక్షేమ పథకాలు, వలంటీర్‌, సచివాలయ వ్యవస్థ మళ్లీ కొనసాగాలంటే మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలతోత లక్షలాది మంది పేదల జీవితాల్లో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టామని చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా లేక, ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుని, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ, జనసేన పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఐదేళ్ల పాలనలో పార్టీ, కుల,మతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసుల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని ప్రసాదరాజు పేర్కొన్నారు. దర్బరేవు గ్రామంలో ఒక్క రూపాయి కూడా అవినీతికి తావులేకుండా నేరుగా 1,602 మంది రైతులకు 1,754ఎకరాల కంపెనీ భూములు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్‌ నాయకులు పెచ్చెట్టి రాజశేఖర్‌, పెచ్చెట్టి అరుణ్‌కుమార్‌, పెచ్చెట్టి శ్రీరామ్‌, వారి కుటుంబ సభ్యులు చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో పార్టీలో జాయిన్‌ అయ్యారు. వారికి పార్టీ కండువాలను కప్పి ప్రసాదరాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ గుబ్బల రాధాకృష్ణ, సర్పంచ్‌ పెన్మెత్స విజయలక్ష్మి, కలిదిండి బాబుల్‌రాజు, బంగార్రాజు, కాశిరాజు, పెన్మెత్స సుబ్బరాజు, వేగేశ్న సీతారామరాజు, వైఎస్‌ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, దెందుకూరి నరసింహరాజు, దొంగ మురళీకృష్ణ, తిరుమాని రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓట్లు వేయండి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న శారదావాణి

నరసాపురం: నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేసి మళ్లీ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ముదునూరి సతీమణి శారదావాణి ప్రజలకు సూచించారు. భర్త గెలుపు కోరుతూ శారదావాణి పట్టణంలో చేపట్టిన ప్రచారం జోరుగా సాగుతోంది. వరుసగా మూడవరోజు ఆమె పట్టణంలోని 1వ వార్డు లాకుపేటలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. నరసాపురంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వశిష్ఠ వంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్‌ వంటి కీలక ప్రాజెక్టులను తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్‌ సోమరాజు దుర్గాభవానీ తదితరులు ఉన్నారు.

రామన్నపాలెంలో..

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ ఐదు సంవత్సరాల్లో మీగ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు కుమారుడు శ్రీకృష్ణంరాజు ఓటర్లను కోరారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీలోని పిట్టావారిపేటలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ తన తండ్రి ప్రసాదరాజు మీ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు అయితం ధనలక్ష్మి, ఆకన దుర్గ, నాయకులు అయితం బాబులు, ఆకన దొరబాబు, అనంత సుబ్రమణ్యం,చినిమిల్లి చందు, కొల్లాబత్తుల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



రామన్నపాలెం పంచాయతీ పిట్టావారిపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న కృష్ణంరాజు

96 శాతం పింఛన్‌ల పంపిణీ



ఓ వృద్ధురాలికి ఇంటి వద్దే పింఛన్‌ అందిస్తున్న దృశ్యం

మొగల్తూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు కారణంగా పింఛన్‌ దారులకు సకాలంలో పింఛన్‌ అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన ప్రభుత్వం ప్రతి నెలా అందించే సామాజిక పింఛన్‌లను అందించేలా చర్యలు తీసుకోవడంతో పింఛన్‌ దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 10,844 పింఛన్‌దారులకు గాను గత మూడు రోజులుగా సుమారు 10,417 మంది లబ్ధిదారులకు పింఛన్‌ అందించారు. ప్రతి సచివాలయ పరిధిలో ఆయా సచివాలయాల వద్ద టెంట్‌లు వేసి, తాగు నీటి సౌకర్యం కల్పించి పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అనారోగ్యంతో, నడవలేని స్థితిలో ఉన్నవారిని గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి బయోమెట్రిక్‌ తీసుకుని పింఛన్‌లు అందించారు. శనివారం ఒక్క మొగల్తూరులోనే సుమారు 45 మంది లేవలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్‌ అందించామని సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ పి.గణేష్‌ తెలిపారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



గుంపర్రులో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. గుంపర్రు గ్రామంలో శనివారం ఆయన తన భార్య మంగతాయారు, కుమారుడు సాయి బాలాజీలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారంతా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఎలాంటి సిఫారసులు, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలన్నీ అందాలంటే తప్పనిసరిగా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఎంపీ ఓటు గూడూరి ఉమాబాలకు, ఎమ్మెల్యే ఓటు తనకు రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని గోపి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పాత్తూరి బుచ్చిరాజు, డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, సర్పంచ్‌ తుంగా అమూల్య, ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరా ఉమాశంకర్‌, ఉపాధ్యక్షుడు పితాని శ్రీనివాస్‌, జేసీఎస్‌ నియోజకవర్గ కన్వీనర్‌ ఉచ్చుల స్టాలిన్‌, సర్పంచ్‌ల చాంబర్‌ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, నాయకులు తుంగా నాగేశ్వరరావు, ముప్పిడి కుమార్‌, జద్దు బదరి, పితాని కేశవరావు, గణపాబత్తుల ఏసుబాబు, బోనం బులి వెంకన్న, కపురు గోపి, పాలంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు



తూర్పుపాలెంలో మాజీమంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పోడూరు వలంటీర్లు

పెనుగొండ: ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లపై బురద జల్లుతున్న కష్టకాలంలో అండగా నిలిచారంటూ పోడూరు వలంటీర్లు మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడుచెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్లు గా రాజీనామా చేసిన అనంతరం శనివారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండు మూడు నెలలుగా చంద్రబాబు, పవన్‌ విమర్శలకు మానసిక క్షోభ అనుభవిస్తున్నామని తెలిపారు. చివరకూ అవ్వాతాతలకు పింఛన్లు సైతం ఇవ్వనివ్వకుండా చంద్రబాబు వర్గం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వలంటీర్లుగా రాజీనామా చేశామంటూ తెలిపారు. ఇకపై ధైర్యంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైఎస్సార్‌ సీపీకి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలు పంపిణీ చేయాలి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు

పెనుమంట్ర: ప్రతి గ్రామంలో ఓటర్లకు స్లిప్పులను బీఎల్‌ఓలు పంపిణీ చేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్‌ కార్యాలయంలో సూపర్‌వైజర్లు , బూత్‌ లెవల్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఈనెల 14లోపుగా తమ ఓటు హక్కు కోసం ఫారం 6 ను దరఖాస్తు చేసుకోవాలని. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, అధిక శాతం అంగవైకల్యం ఉన్న విగలాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల కమిషన్‌ కల్పించిందని, దానికి ఫారం 12–డి దరఖాస్తు చేయించి, వారు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బీఎల్‌ఓలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ కోట లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ పద్మజ, సెక్టార్‌ అధికారులు నాగిరెడ్డి, సూర్యనారాయణరాజు, ఎలియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో ఆకట్టుకున్న చిర్రావూరి ప్రవచనాలు



సిద్ధాంతంలో ప్రవచనకర్త చిర్రావూరికి స్వాగతం పలుకుతున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం పవిత్ర వశిష్టగోదావరి తీరం శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. హిందూధర్మం ఛానల్‌లో ప్రముఖ ప్రవచనకర్త చిర్రావూరి గురువు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రవచనాలు వినిపించి ఆశీర్వచనాలు అందజేశారు. గ్రామానికి విచ్చేసిన చిర్రావూరి వారిని భక్తులు సన్నాయి మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆయన గ్రామంలోని దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలో అఖండ దీపప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో వంగూరి భాస్కర్‌, తురగా చంద్రశేఖర్‌, కసుగుర్తి వెంకటరమణ, బొక్కా సత్యం, మానేపల్లి వెంకటకృష్ణ, యక్కల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

11న వాండ్రంలో సువార్త సభ

ఉండి: మండలంలోని వాండ్రంలో ఉన్న సెయింట్‌ జాన్స్‌ లూథరన్‌ చర్చిలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి వాండ్రం వారి ఆధ్వర్యంలో సువార్త సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోనాల సుదర్శనం, మరియమ్మ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెవరెండ్‌ వి.నెహ్రూ సభను ప్రారంభిస్తారని, సిస్టర్‌ డాక్టర్‌ కె.అంజలి (హైదరాబాద్‌) వాక్యోపదేశం చేస్తారని తెలిపారు. ఈ సభకు ఆయా మండలాలకు చెందిన క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మేజిస్ట్రేట్‌ అజయ్‌కుమార్‌కు సత్కారం



సిద్ధాంతంలో మేజిస్ట్రేట్‌ నక్కా అజయ్‌కుమార్‌ దంపతులను సత్కరిస్తున్న మిత్రులు

పోడూరు: నిడదవోలు రెండో అదనపు జ్యుడిషియల్‌ మేజిస్ట్రేట్‌ నక్కా అజయ్‌కుమార్‌ దంపతులను శనివారం పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో ఆయన చిన్ననాటి మిత్రులు ఘనంగా సత్కరించారు. తణుకులో లాయర్‌గా విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్‌ గత నెల 7న మేజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సిద్ధాంతం హైస్కూల్‌లో ఆయనతో కలసి చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా అజయ్‌కుమార్‌, కమలరత్నం దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌ మాట్లాడుతూ చిన్నతనంలో తనతో చదువుకున్న మిత్రుల చేతులమీదుగా సత్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నర్సింహమూర్తి, ర్యాలి శంకరం, గుల్లిపల్లి గంగరాజు, బిరుదుగంటి రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.